# పతిదేవుడూ - పాలబూతూ

ఈ మధ్య నాకో కష్టం వచ్చింది. ఒకరితో చెప్పుకుంటే తీరేది కాదు. ఎందుకంటే ఎవరూ, ఆర్చలేరు - తీర్చలేరు కాబట్టి. అనుభవించక తప్పదు. పట్నంలో నివసించేవాడు పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు అనేవాడు మా మేనమావ. అతనిప్పుడు లేడు (చచ్చి) స్వర్గాన వున్నాడు. కొన్ని కష్టాలు తెల్లవారేసరికే మొదలవుతాయి. తెల్లవారేసరికి కాఫీ కావాలికదా! ఆ కాఫీకి పాలుండాలి ! పాలకోసం తెల్లవారకుండానే లేచి పాలబూతికెళ్లి క్యూలో నిలబడాలి. ఈ రకం కష్టంనుండి తప్పించుకొందుకే ఓ మనిషిని కుదుర్చుకొన్నాం. ఒక్కో పేకట్‌కి నెలకీ ఆర్రూపాయలు పారేస్తే ఉదయం రెండు పేకెట్లు, సాయంత్రం రెండు పేకెట్లు తెస్తుందామె. అంటే ఆమెకి నెలకి పాతిక రూపాయలు. పోతే పోయాయ్ పాతిక! ఉదయం ఏడుగంటల వరకు "కాఫీ రడీ" అని అర్ధాంగి దుప్పటిలాగి చెప్పేవరకు హాయిగా రెండో తలగడాని కావలించుకొని పడుకోవచ్చు. ఏమంటారు ? మీరు కాదనరని నాకు తెలుసు! డిసెంబరు నెలలో చలెక్కువ. ఆ నెల్లోనే వచ్చింది నాక్కష్టం!.

పాలు పేకట్లు తెచ్చే పాపాయమ్మ నాలుగు రోజులు సెలవు పెట్టింది. తన అన్నయ్య కొడుకి పెళ్లికి అనకాపల్లి వెళ్ళింది. అంచేత ఆ పాల డ్యూటీ నాకు పడింది. తెల్లవారురఝామున నాలుగున్నరకల్లా అలారం పెట్టుకొని లేపుతుంది అర్ధాంగి అనూరాధ. చలిలో లేచి వెళ్లడానికి ఇబ్బందే అయినా తప్పదు. పాలకేంద్రం మా ఇంటికి పెద్ద దూరం లేదు. సెంట్రల్ బ్యాంక్‌కి ఎదురుగా మూడు లాంతర్ల జంక్షన్‌కి దగ్గరగా వుంది. ఆ పాల వేన్ విశాఖపట్నం నుంచి రావాలి. ఎప్పుడు వస్తుందో ఎవరికి తెలీదు. కానీ నాలుగున్నరా - ఆరుగంటల మధ్య వస్తుందని అందరికీ తెలుసు. ఏడూ - ఏడున్నరకీ వచ్చిన రోజులు వున్నాయి. అది వచ్చినప్పుడు మనం రడీగా వుండాలి. ఆలస్యం అయితే అంతేసంగతులు! ఇతర బూతుల దగ్గరకి పరుగులు తీయాలి. అక్కడయినా దొరుకుతాయని గ్యారంటీ లేదు. పాలకేంద్రం దగ్గర

మనలాంటి వాళ్లెందరో వుంటారు. కాలక్షేపానికి కొదువలేదు.

మా పిన్నత్తగారి కొడుకు ప్రభాకర్ కూడా వస్తున్నాడీ మధ్య. అతను మంచిమాటకారి. కులసాపురుషుడు! నన్ను చూడగానే (బావగారిని కదూ!) అప్యాయంగా పరకరిస్తాడు.

న్యూస్ పేపరు వచ్చే సమయం కాబట్టి మూడు లాంతర్ల జంక్షన్‌కి పోతాం. పేపరు కొంటాడు, తర్వాత కాఫీ తాగుదాం అంటాడు. కాఫీ తాగిస్తాడు "బెడ్‌కాఫీ" తర్వాత పేపరుని తలో పార్టునీ తీసుకొని చదవడం ప్రారంభిస్తాం. సిగరెట్ ముట్టించి పేపరు విప్పుతాడు ప్రభాకర్ చలిపోవడానికి. పేపరు పఠనం అవుతుంది. అప్పటికీ పాల వేన్ రాకపోతే మరో సిగరెట్ వెలిగిస్తాడు ప్రభాకర్. ఆ రోజు పాలవేన్ ఆలస్యంగా అంటే ఏడు గంటలకి, ప్రభాకర్ నాలుగో సిగరెట్ తగలేశాక వచ్చింది. మరోసారి కాఫీ తాగాంకూడా.

పాలపేకట్లు అర్ధాంగికందిస్తూ విసుక్కొన్నా. "రోజు వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా వుంది" అని "పాపాయమ్మ ఈ రోజు వచ్చేస్తుంది లెండి! రేపట్నుంచీ వెళ్లక్కర్లేదు" సముదాయించింది అనూరాధ.

తర్వాత నేను చల్లబడ్డాక వేడి కాఫీ అందిస్తూ అంది. "నాలుగు రోజులకే చికాకు పడిపోతున్నారు! చక్కా మా పిన్ని కొడుకు చూడండి! రోజూ వెళ్లి తెచ్చుకొంటున్నాడు. పాపాయమ్మని మాన్పించేసింది మా వదిన! నెలకి పాతిక రూపాయలు మిగుల్తాయని"!

అనూరాధ ఆఖరి మాటలు నాకాశ్చర్యాన్ని కల్గించాయ్!

"నెలకి పాతిక అంటే రోజుకెంత మిగుల్తుంది"! అడిగా.

"ఏమో! మీరే లెక్క చెప్పండి!" అంది విసుగ్గా.

"డెబ్బై పైసలు" అన్నా.

"అలా లెక్కలు కడ్తోంది కాబట్టే నెలకి అయిదువందలు చీటీ కడ్తోంది మా వదిన! దానికీ పిల్లలకీ మెడలో ఎంత బంగారం వుందో చూశారుగా! మీరూ

వున్నారెందుకు! పోస్టాఫీసు రికరింగ్ డిపాజిట్టు యాభై రూపాయిలూ నెలనెలా కట్టలేకపోతున్నారు. బాకీలతో కడ్తున్నారు! పిల్లలున్నారు వెనకేసుకోవాలన్న జ్ఞానంలేదు! అయినా మీ జీతం వచ్చేపోయే చుట్టాలకే సరిపోతుంది! చుట్టాలొచ్చే ఇల్లూ, దొంగలు పడ్డిల్లూ ఎత్తిరిల్లదని వూరికినే అనలేదు!".

వాళ్ల ఒదిన పొదుపరితనాన్ని మెచ్చుకుంటూ నా సంసారాన్ని ఎండగట్టింది. నాలో కాస్త పౌరుషం వచ్చింది.

"మీ అన్నయ్యకి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో వుద్యోగం! మీ ఒదిన తలచుకొంటే నెలకేం కర్మ! రోజుకే అయిదువందలు చొప్పున చీటీ కట్టగలదు!

మొగుడు రెండు చేతులకీ వున్న పదివేళ్లతోనూ సంపాయిస్తున్నాడు. సంపాదన వస్తూన్న కొద్దీ ఆమెకి పిసినారితనం ఎక్కువవుతోంది. మొగుడ్ని పాలకి పంపితే పాతిక రూపాయలు మిగుల్తాయనుకొంది. పనిమనిషిని కూడా మాన్పించేయమను! కానీ ఆ పని చేయదే! తనకి కష్టం వుండకూడదు. మొగుడు మాత్రం చలిలోనొణుకుతూ పాలకోసం పాట్లు పడాలి!" అని అగి ఆమె మొహంలోకి చూశా. అనూరాధ మాట్లాడలేదు. మళ్లీ చెప్పడం మొదలు పెట్టాను.

"మీ ఒదిన తాను పొదుపు చేస్తోందని మురిసి పోతోంది కాబోలు! పాలబూత్ దగ్గర పతిదేవుని 'ఖర్చు' తెలిస్తే తెలివితప్పి దభాల్న పడిపోతుంది. తెప్పరిల్లిన తర్వాత పాలకోసం పాపాయమ్మ దగ్గరకి పరుగెడ్తుంది!"

"పాల బూతు దగ్గర ఖర్చేముంటుందండి! బ్లాకులో కొంటారా? లేక లంచం ఇస్తారా?" ఆశ్చర్యంగా అమాయకంగా అడిగింది.

అక్కడే జరిగే వ్యవహారం వివరంగా చెప్పి, 'రోజూ ఉదయం పూట అతని ఏవరేజ్ ఖర్చు మూడు రూపాయలు"ని చెప్పా.

"అయితే మీరూ అక్కడ రోజూ కాఫీ తాగుతున్నారా?" కాస్త కోపం మిళితం చేసి అనుమానంగా అడిగింది.

"ఆ తాగుతున్నా!" చెప్పా.

"అలా అయితే నేనే వెళ్లేదాన్ని కదండి!" అంది.

"నువ్వేం బాధపడకు! నా కాఫీల ఖర్చుకూడా మీ అన్నయ్యే పెట్టుకొనేవాడు. బావగారిని కదూ! పైగా నాలుగు రోజులు గెస్టుని! ఈ సంగతి మీ ఒదినకి చెప్పకు సుమా!" హెచ్చరించాను.

"అయినా పాలకింక మిమ్మల్ని పంపకూడదు!" అంటూ ఖాళీ గ్లాసు తీసుకొని వంటింట్లోకి వెళ్లింది.

ఆంధ్ర జ్యోతి సచిత్ర వారపత్రిక
(1993 దీపావళి ప్రత్యేక సంచిక)